క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కరణ్ గజేంద్రభారతి మహరాజ్

నారాయణఖేడ్: ఖేడ్ రామ మందిరంలో గత నెల 26న ప్రారంభమైన సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజున ఏకాంబ పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్‌చే కాలకీర్తన, నగర ప్రదర్శన, ఉత్సవ పరిసమాప్తం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ రామాలయ పునర్నిర్మాణానికి రూ.1,11,111లను విరాళంగా అందజేశారు. అన్నవితరణ ఏర్పాటు చేయించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్‌ను కరణ్ గజేంద్ర భారతి మహరాజ్‌తో పాటు ఆలయ కమిటీ బాధ్యులు ముత్యపు హన్మండ్లు సేట్, వివేకానంద్, పాండు తదితరులు పూల మాలతో సన్మానించారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణ శివారులోని హెచ్‌ఆర్ ప్యాలస్‌లో మనూరు మండల బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ నేతల తప్పుడు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అభివృద్ధిలో దేశానికి తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్‌గా మారిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర రైతుబంధు సమితి డైరెక్టర్ మారుతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు, నాయకులు నాగేందర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరికలు



పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బాపు మల్శెట్టి

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని బోర్గి గ్రామంలో మంగళవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీలో బీఆర్‌ఎస్ నుంచి దాదాపు 100 మందికిపైగా వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరినట్టు ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాపు మల్శెట్టి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి జుక్కల్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి బోర్గి సంజీవ్, గోవింద్‌యాదవ్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో బిరదార్ దిగంబర్ పాటిల్, అంజని రాముపాటిల్, ప్రభురెడ్డి, కొల్లురే గణపతి పాటిల్, నాగ్‌గొండ, బజరంగ్ పాటిల్, మంగలి నర్సింలు, జావిద్, శ్రీకాంత్‌రెడ్డి, సొనాలే పీరాజీ పాటిల్, భీమప్ప, బాలప్ప, మారుతి తదితరులు ఉన్నారు. వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల్లో అధికారం చేపట్టడం ఖాయమని బాపు మల్శెట్టి అన్నారు.

మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి

కంది(సంగారెడ్డి): వన నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కంది మండల పరిధిలోని చేర్యాల్, ఎర్దనూర్ గ్రామాల్లో వన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్లు, పూల మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాణిక్యం, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ అంబర్‌సింగ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

ఝరాసంగం(జహీరాబాద్): సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని ఎంపీడీఓ సుజాత, ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ పరమేశ్వర్‌పాటిల్ సూచించారు. నాలుగు రోజులుగా పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఝరాసంగంతో పాటు మేదపల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం సోమవారం రాత్రితో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమొంటోలు అందజేశారు. అదే విధంగా బర్దిపూర్ గ్రామంలో నిర్వహించిన వశిష్ఠ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కాంచన రాథోడ్, ప్రోగ్రాం అధికారులు హరికుమార్, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సిద్ధేశ్వర జాతరకు సర్వం సిద్ధం

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- హాజరుకానున్న పీఠాధిపతులు, ప్రముఖులు



పొట్టిపల్లిలోని సిద్ధేశ్వరస్వామి ఆలయం

ఝరాసంగం(జహీరాబాద్): పురాతన దేవాలయాల్లో ఒకటైన సిద్ధేశ్వర ఆలయం జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. మండల పరిధిలోని పొట్టిపల్లి గ్రామ శివారులో చుట్టూ పచ్చటి పొలాల మధ్య ఉన్న గట్టుపై ఆలయం ఉంది. ప్రతి ఏడాది ఆలయ నిర్వాహకులు జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా ఆలయానికి రంగులు వేసి రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకించారు. బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోనున్నారు.

జాతర కార్యక్రమాల వివరాలు..

- ఈ నెల 5న బుధవారం ఉదయం 8గంటలకు శిఖరపూజ, ధ్వజారోహణం, ఉదయం 9గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, ఉదయం 11గంటల నుంచి అన్నదాన కార్యక్రమం.
- 6న గురువారం శుద్ధ పౌర్ణమిన ఉదయం 9గంటలకు స్వామివారి రుద్రాభిషేకం, ఉదయం 11 గంటలకు అన్నదానం. రాత్రి 2గంటలకు గ్రామం నుంచి దేవాలయం వరకు స్వామివారి పల్లకిసేవా కార్యక్రమం ఉంటుంది.
- 7న శుక్రవారం ఉదయం 6:30 గంటలకు అగ్నిగుండం పూజ, అగ్ని ప్రవేశం, 9గంటలకు మహాత్ములచే ప్రవచనం, నిత్యపూజలు, అనంతరం అన్నదాన కార్యక్రమం.

హాజరుకానున్న పీఠాధిపతులు

జాతర మహోత్సవ కార్యక్రమంలో తాడోళ ఆశ్రమ పీఠాధిపతి 108 రాజేశ్వరస్వామి, ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి 108 వీరేశ్వర శివాచార్యస్వామి, తండగిపల్లి ఆశ్రమ పీఠాధిపతి 108 శివయోగి శివాచార్య స్వామి, రంజోల్ రాజయోగ నిలయ పీఠాధిపతి రాచయ్యస్వామితో పాటు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నాయకులు హాజరుకానున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవాలకు ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల భక్తులతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



బాలింతలు, గర్భిణులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: పోషకాహారంలో భాగంగా చిరుధాన్యాలను తీసుకుంటే బాలింతలు, గర్భిణులు, ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని శ్రీవాసవి కళ్యాణ మండపంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణపక్షం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ సీడీపీఓ సునిత బాయి, సూపర్‌వైజర్ అంజమ్మ, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మోహినోద్దీన్, నాయకులు నామరవికి రణ్‌గుప్తా, ఇబ్రాయిల్, సిబ్బంది శ్రీశైలం, నీరజ, సద్గుణ, విజయలక్ష్మి, రాధమ్మ, అనిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కాలుష్యకారక పరిశ్రమ వద్దు

వడ్డేపల్లి గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం



తీర్మానాలపై ఆమోదం తెలుపుతున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): కాలుష్యకారక పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ సభలో గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ స్వరూప అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం పలు తీర్మానాలు చేశారు. ఆ తర్వాత గ్రామ శివారులోని సర్వే నంబర్ 529/ఎఎ/1 నిర్మిస్తున్న సురభి లాబరేటరీస్ పరిశ్రమ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా పచ్చటి పంట పొలాల నడుమ కాలుష్యకారక పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే ఇక్కడి పరిసరాలు విషతుల్యమయ్యే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా కాలుష్యకారక పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసి పరిసర గ్రామాల ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ సెర్మనీ



సర్టిఫికెట్‌లను అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో మంగళవారం ప్రీ–ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెర్మనీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పుస్తక రచయిత, గోల్డెన్‌బుక్ అవార్డు గ్రహీత, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ శ్రీవేణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమదైన ప్రతిభను కలిగి ఉంటారని, దాన్ని గుర్తించి ప్రోత్సాహించడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. అనంతరం అకాడమిక్, స్పోర్ట్స్ ఇతర రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత సాలోమోన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న నాయినిఈశ్వర్

కొండాపూర్(సంగారెడ్డి): ప్రశ్న పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడంతో పాటు కేసును సీబీఐకి అప్పగించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణం నాయిని ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీఎస్పీ సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులు వినోద్‌కుమార్ అధ్యక్షతన సంగారెడ్డిలోని నటరాజ్ థియేటర్ పక్కన 48 గంటల నిరసన దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వర్ మాట్లాడుతూ 36 లక్షల నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇంచార్జిలు ప్రేమ్ కుమార్, జగదీశ్వర్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్‌ఇక్బాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి బాలయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈశ్వర్, జిల్లా కోశాధికారి జనార్దన్, జిల్లా కార్యదర్శులు పెంటన్న, జిల్లా మహిళా కన్వీనర్ పల్లవి, అసెంబ్లీ అధ్యక్షులు, అసెంబ్లీ ఇంచార్జిలు పాల్గొన్నారు.

ఓటరు చైతన్య సైకిల్ యాత్ర



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న సిద్ధురావణ్

జహీరాబాద్ టౌన్: ఓటరును చైతన్య పరచడానికి బీఎస్పీ ఆధ్వర్యంలో సైకిల్‌యాత్రను మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిద్ధురావణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన ఓటును అమ్ముకొని బానిసలు కావద్దన్న ఉద్దేశంతో ఈ యాత్రను చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాబురావు, రాచన్న, శ్రీశైలం, యాదగిరి, అశోక్, రవి పాల్గొన్నారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సైకిల్‌యాత్రను ప్రారంభించారు.

జహీరాబాద్: బీఎస్పీ ఆధ్వర్యంలో సైకిల్ యాత్రను పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిద్ధురావణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులు పాలకులుగా మారేందుకు అత్యంత విలువైన ఆయుధాన్ని అంబేద్కర్ ఓటు రూపంలో అందజేశారన్నారు. కార్యక్రమంలో స్వేరో నాయకులు పవన్,నాయకులు బాబూరావు, రాచన్న, శ్రీశైలం, యాదగిరి, అశోక్, రవి పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లికి బోనాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో మంగళవారం ఎల్లమ్మదేవికి మహిళలు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా నవనాథ్ సిద్దిలింగేశ్వర ఆశ్రమ పీఠాదిపతి జగద్గురు జగదీశ్వరీ మాతను రథంతో ఊరేగింపు నిర్వహించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో కాసుగొండ లచ్చవ్వ 3వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం చలివేంద్రం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సంబంధిత కుటుంబీకులు ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ఎస్సై సత్యనారాయణ, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు శేరికర్ అరుణ్‌రాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ వ్యవస్థాపకులు ఓంప్రకాష్, సర్పంచ్‌లు మనోహర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రం నారాయణ, మండల కోఆప్షన్ అహ్మద్, ఆత్మాడైరెక్టర్ రమేష్, సురేష్ పాటిల్, కురాకుల కృష్ణ, మారుతి, జీవన్‌పటేల్, బాల్‌రెడ్డి, తిప్పప్ప, జగన్నాథ్, పాల్గొన్నారు.

లింకు రోడ్డు పునరుద్ధరించాలని వినతి

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని ముచ్చర్ల శివారులోని పటాన్‌చెరువు దౌల్తాబాద్ రోడ్డు నుంచి ఎల్లాపూర్ వెళ్లే లింకు రోడ్డు పనులను అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్తులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏండ్లుగా ముచ్చర్ల ఎల్లాపూర్ గ్రామాలకు లింకు రోడ్డుగా ఉన్న మట్టి రోడ్డును దాతల సాయంతో తాము వెడల్పు చేసుకుంటుండగా కొందరు గ్రామస్తుల ఫిర్యాదుతో ఇటీవల హత్నూర తహసిల్దార్ రోడ్డును జేసీబీతో ధ్వంసం చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో లింకు రోడ్డు పాడవడంతో పాటు ముచ్చర్ల గ్రామ శివారులోని నాగటి చెరువు ఆయకట్టుదారులు పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా రెండు గ్రామాల లింక్ రోడ్డును పునరుద్ధరించి నాగర్ చెరువు ఆయకట్టుదారులకు న్యాయం చేయాలని వినతిపత్రంలో వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మీనంపల్లి కిషన్‌రావు, సర్పంచ్ బెగరి అనిత యాదగిరి, స్థానికులు కాశయ్య స్వామి, సదానందం, మల్లేశం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాం



ఆనంద్‌కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులతో కలిసి పోరాటం చేస్తామని బొల్లారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు ఆనంద్‌కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం బొల్లారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులుగా ఆనంద్‌కృష్ణారెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు నరేందర్‌రెడ్డితో పాటు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆ పార్టీ నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్, నాయకులు రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రం ఏర్పాటు



మాట్లాడుతున్న కార్పొరేటర్, కమిషనర్

పటాన్‌చెరు టౌన్: గ్రూపు మహిళలకు స్వయంఉపాధి కోసం కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రంను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్‌కుమార్ యాదవ్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బండ్లగూడలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్ర స్థలాన్ని జీహెచ్‌ఎంసీ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గ్రూపు మహిళలకు స్వయం ఉపాధి కోసం 20 కుట్టు మిషన్లను అందజేసి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, గొల్ల కృష్ణయాదవ్, భరత్ పద్మ మేరీసాబీర్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రశ్నపత్రాల లీకేజీ



మాట్లాడుతున్న ప్రకాష్‌రాథోడ్

నారాయణఖేడ్: ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యపు విధానాలతోనే ప్రశ్నపత్రాలు లికేజీ అవుతున్నాయని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రకాష్ రాథోడ్ అన్నారు. నారాయణఖేడ్‌లో మంగళవారం సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లికేజీకి కారకులైన వారిపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తుండటంతో టెన్త్ ప్రశ్నాపత్రాలు సైతం లీకయ్యాయన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రశ్నాపత్రాల లికేజీకి బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా బాధ్యులు సురేష్‌నాయక్, సురేష్ రాథోడ్, శ్రీనివాస్‌నాయక్, సంగమేష్, అజయ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరీక్ష కేంద్రాల సందర్శన

పటాన్‌చెరు టౌన్: పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం విద్యాశాఖ అధికారులు సందర్శించారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఫాదర్ స్కూల్ ఎస్టీ జోసెఫ్ హై స్కూల్, శ్రీ చైతన్య హైస్కూల్, రామచంద్రపురం పరిధిలోని ఎస్‌ఎస్‌సీ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ జ్యోతి విద్యాలయం, జెడ్పీహెచ్‌ఎస్ తెల్లాపూర్‌లను డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఎస్‌సీఆర్టీ రాధారాణి, జిల్లా విద్యాధికారి విజయ, ఎంఈఓ పీపీ రాథోడ్, సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

◆ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

వట్‌పల్లి(అందోల్): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని రంగపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేరూర్ గ్రామంలోని రేణుకఎల్లమ్మ ఆలయ నిర్వాహకులు పెద్దపట్ల శోభారాణి కిష్టాగౌడ్ దంపతులు పాదపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుమార్, సురేష్‌రావు, గజ్వాడ వీరేశం, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

◆ ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయాలని ఆందోళన

కొండాపూర్(సంగారెడ్డి): ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయి వారం రోజులు గడుస్తున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదని మండల పరిధిలోని సైదాపూర్ గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయాలని మండల విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించకపోవడంతో నిరసన చేపట్టామన్నారు. 20రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొండాపూర్ విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

◆ రాజ్యాంగ విశిష్టతపై వ్యాసరచన పోటీలు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో మంగళవారం భారత రాజ్యాంగం విలువలు, విశిష్టత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ భార్గవి మాట్లాడుతూ నేటి యువతరానికి భారత రాజ్యాంగం విలువలు, రాజ్యాంగం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు కళాశాల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు డిగ్రీ కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ధీనేష్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ పార్టీ కోసం పనిచేయాలి

జోగిపేట(అందోల్): నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కన బెట్టి పార్టీ అభివృద్ధికి పని చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాహుల్ కిరణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణంలు అన్నారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ నారాయణ, ఎంపీపీ బాలయ్య, రైతు బంధు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు లింగాగౌడ్, మార్కెట్ డైరెక్టర్ మాణిక్ రెడ్డి, రైతు బంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు వర్కల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

◆ సతీమాత వర్ధంతి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని బోర్గి గ్రామ శివారులో పురాతన సతీమాత ఆలయంలో మంగళవారం వర్ధంతి ఉత్సవాలను మధుర లంబాడీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల భక్తులతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

◆ వరిపంటపై అవగాహన సదస్సు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని చింతల చెరువు రైతు వేదికలో మంగళవారం వరిపంట ఇతర పంటలతో పాటు సహజ వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన సదస్సుకు రైతు శిక్షణ కేంద్రం సంగారెడ్డి సహాయ వ్యవసాయ సంచాలకులు రామకృష్ణ, పుష్ప, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్‌గౌడ్, అంజలి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవిలో పాటించాల్సిన సమగ్ర సస్యరక్షణపై రైతుల వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వరప్రతాప్, రైతులు నరహరి, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

◆ పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

రాయికోడ్(అందోల్): రైతులు తాము పొందిన పంట రుణాలను ఏడాదిలోపు విధిగా రెన్యూవల్ చేసుకోవాలని రాయికోడ్ ఏపీజీవీబీ మేనేజర్ సురేందర్ సూచించారు. మండలంలోని ఖాంజమాల్‌పూర్ గ్రామంలో ఖాతాదారులకు బ్యాంకు లావాదేవీలు, బ్యాంకు ద్వారా అందే సేవలతో పాటు అమలు చేస్తున్న పథకాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోని అధిక వడ్డీ వర్తించకుండా చూసుకోవాలన్నారు. గ్రామానికి చెందిన పల్లెశేఖర్ ఇటీవల మృతి చెందగా బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతిభీమా పథకంలో సభ్యుడిగా ఉండగా బీమా ద్వారా వచ్చిన రూ.2లక్షల చెక్కును మృతుడి భార్య ఐశ్వర్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, బ్యాంకు అధికారులు సమంత్, ప్రశాంత్, బీఆర్‌ఎస్ నాయకుడు సిద్దారెడ్డి, బ్యాంకుమిత్ర నాగమణి పాల్గొన్నారు.

◆ క్యూరియా రీసెర్చ్ పరిశ్రమ సేవలు అభినందనీయం

కొండాపూర్(సంగారెడ్డి): క్యూరియా రీసెర్చ్ పరిశ్రమ సేవలు అభినందనీయమని కస్తూర్బా వసతి గృహం ఎస్‌ఓ కవిత పేర్కొన్నారు. రీసెర్చ్ పరిశ్రమ వారు తమ సీఎస్‌ఆర్ నిధుల నుంచి కస్తూర్బా వసతిగృహనికి పెయిటింగ్ వేయించడంతో పాటు దోబీఘాట్ వద్ద ఫ్లోరింగ్, కొత్త టైల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పాటు సైన్స్ ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలు, క్రీడాసామగ్రి, స్టాఫ్ రూంకు సంబంధించి టేబుల్స్, కుర్చీలు, శానిటరీ నాప్‌కిన్స్, ఇన్సులేటర్స్ తదితర వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ కవిత మాట్లాడుతూ నిరుపేద బాలికల విద్యకు తమ వంతుగా సహాయం చేయడానికి ముందుకు వచ్చిన క్యూరియా రీసెర్చ్ పరిశ్రమ సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ నాటక ప్రదర్శనకు విరాళం అందజేత

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన రేణుక ఎల్లమ్మదేవి జీవిత చరిత్ర నాటక ప్రదర్శనకు జెడ్పీటీసీ స్వప్నభాస్కర్ నిర్వాహకులు గొల్ల నర్సింహులు, బొల్లి ఈశ్వరప్పలకు మంగళవారం రూ.15వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్నివర్గాల వారు కలసిమెలసి నిర్వహిస్తున్న నాటకంతో ప్రజలందరికి మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధన్న, ఈరన్న, శ్రీనివాస్, బస్వరాజ్, ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పటాన్‌చెరు టౌన్: మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు.రంజాన్‌మాసం కావడంతో మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్‌కాలనీలో అబూబకర్ మసీదులో మైనారీలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఉన్నతికి కృషి చేస్తోందని తెలిపారు. రంజాన్ పవిత్రమాసంలో మైనార్టీ సోదరులకు ఇఫ్తార్‌విందు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

◆ కళాకారులకు సన్మానం

మునిపల్లి(అందోల్): ఎల్లమ్మ నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులకు కాంగ్రెస్ నాయకులు రుద్రకృష్ణ రూ.50 వేలను విరాళంగా అందజేశారు. మండలంలోని చిన్నచల్మెడలో మంగళవారం ఎల్లమ్మ నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా రుద్రకృష్ణకు సర్పంచ్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన కళాకారులు శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ పాస్టర్లకు దుస్తులు పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఈస్టర్ పండుగను పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది పాస్టర్లకు నందికంది ఉపసర్పంచ్ సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రాజేందర్, వెల్టూరు బాబు, సంజీవరావు, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

◆ ఆర్థికసాయం అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌కాలనీలో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భారతమ్మకు ఎన్‌ఎంఆర్ యువసేన నాయకులు మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యువసేన నాయకులు రవిచారి, మధు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న భారతమ్మకు మందులకు కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండు, కిషోర్, కిరణ్, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.